
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | ఆదివారం 27 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-


## తెలంగాణకు విలన్ నంబర్-1

# కాంగ్రెస్సే

### కాంగ్రెస్ సర్కార్‌కు కేసీఆర్ వార్నింగ్





- ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాను
- 25 ఏళ్లనాడు గులాబీ జెండా ఎగరేశాం
- ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం
- అందరూ అశ్చరపోయేలా పదేళ్లపాటు తెలంగాణను పాలించాం
- తెలంగాణ ఉద్యమం నుంచి వెనక్కిపోతే నన్ను రాళ్లతో కొట్టి చంపమని చెప్పా
- ఆనాడు పదవుల కోసం టీడీపీ, కాంగ్రెస్ వాళ్లు.. పెదవులు మూశారు
- బీఆర్ఎస్ నేతలు పదవులను త్యాగం చేశారు
- ప్రజలు ప్రాణం పోసి ఊపిరి ఊదితే అద్భుతమైన ఉద్యమాన్ని నిర్మించాం
- బలవంతంగా ఆనాడు తెలంగాణను ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్సే
- కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణను సాధించుకున్నాం..

## భారీగా ఐఏఎస్‌ల

# బదిలీలు

### తెలంగాణ కొత్త సీఎస్‌గా కే రామకృష్ణారావు



- ప్రస్తుతం ఆయన తెలంగాణ ప్రభుత్వంలోనే ఆర్థిక ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు.
- ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ
- పరిపాలనలో ప్రక్షాళన దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్పులు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం - మిగతా3లో

## ప్రతి పౌరుడు గర్వపడేలా

# ప్రజా రాజధానిని నిర్మిస్తాం

### 'మన అమరావతి- మన రాజధాని' ప్రతి ఒక్కరి నినాదం

### మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి:**

ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక, పార్కింగ్ సహా వివిధ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మన అమరావతి- మన రాజధాని' ప్రతి ఒక్కరి నినాదం కావాలన్నారు. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సీఎం గురువారం ఆహ్వానం పలకనున్నారు. మరోవైపు సభకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. వేసవి దృష్ట్యా మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది వచ్చే అవకాశముందని సీఎం చెప్పారు. భవిష్యత్ తరాల కోసం రాజధాని నిర్మాణం చేపడుతున్నామన్న ఆయన.. అమరావతి నిర్మాణ పునఃప్రారంభంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. "ప్రతి పౌరుడు గర్వపడేలా ప్రజా రాజధానిని నిర్మిస్తాం. అమరావతి నిర్మాణం రాష్ట్రానికి నవోదయం. రాష్ట్ర చరిత్రలో మే 2 గొప్ప మలుపు అవుతుంది. అమరావతిని దెబ్బతీయాలని గత ప్రభుత్వం అనేక కుట్రలు, దాడులు చేసింది. అనేక సవాళ్లు, కష్టాలను తట్టుకొని అమరావతి నిలబడింది. అద్భుత రాజధాని నిర్మించి.. విధ్వంసకారులకు గట్టి సమాధానం ఇస్తాం. అమరావతి.. ఏపీ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష. ప్రధాని మోదీ కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారు. ప్రధానితో జరిగిన భేటీలో పలు సూచనలు చేశారు." అని చంద్రబాబు అన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- చేపల వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం రెట్టింపుపై మంత్రి హర్షం
- రూ.259 కోట్లతో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి
- చేపల ఎగుమతుల్లో మనమే టాప్ : మంత్రి సవిత

**అంకుశం ప్రతినిధిఅమరావతి : ఏప్రిల్ 27**

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగారాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగాచేపల వేట నిషేధ సయమంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ, మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని, మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. - మిగతా2లో

## ఈఎన్‌సీ హరి రామ్‌కు 14 రోజుల రిమాండ్




- రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు
- హరి రామ్ ఇంటితోపాటు ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు
- కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి
- ఇందులో హరిరామ్ కీలకపాత్ర షోషించారనే ఆరోపణలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసాయి. అనంతరం పోలీసులు ఆయనను అర్ధరాత్రి సమయంలో జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. - మిగతా3లో

# తెలంగాణకు విలన్ నంబర్-1 కాంగ్రెస్సే

**హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యిందని.. ఏడాదిన్నర పాలనలో ఏం చేశారంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు నిలదీశారు. సంచులు నింపుడు.. మోయడంలోనే కాంగ్రెస్ పాస్ అయ్యిందంటూ మండిపడ్డారు. వరంగల్ శివారులోని ఎల్కతుర్తిలో 'రజతోత్సవ సభ'పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టానని.. 25 ఏళ్లనాడు గులాబీ జెండా ఎగరేశాం.. ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం.. అందరూ అశ్చరపోయేలా పదేళ్లపాటు తెలంగాణను పాలించామని కేసీఆర్ అన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం.

సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

### ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కళ్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

### ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు..



"కల్యాణ లక్ష్మికి కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తున్నారు.. మేము వస్తే తులం బంగారం కూడా ఇస్తామన్నారు. పెన్షన్లు పెంచుతామన్నారు.. స్కూటీలు కొనిస్తామన్నారు.. జాబ్ కార్డులు ఇస్తామన్నారు.. ఇచ్చారా?. ఇప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న ఆయన.. ఎన్ని హామీలైనా అమలు చేసి చూపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఉన్న దేవుళ్ల అందరిపైనా ఒట్లు వేశారు. మహిళలే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వద్దని అంటున్నారు. ఆశపడి.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుట్టడం లేదని.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారు.. పరిపాలన చేయడం రాక రాష్ట్రాన్ని ఆగమాగం చేశారు. తెలంగాణను నంబర్‌వన్ స్థానంలో నిలబెడితే.. ఇప్పుడు 14వ స్థానానికి తీసుకెళ్లిపోయారు. హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు" అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేవారు.

### ఇక నుంచి నేను కూడా ఊరుకోను..

యూనివర్శిటీ భూములను ఎవరైనా అమ్ముతారా?. కేసీఆర్ కిట్స్‌ను ఎందుకు బంద్ చేశారు? ఎవరైనా వాటిని ఆపుతారా?. ఇవాళ హైదరాబాద్ యూనివర్శిటీ రేపు ఉస్మానియా యూనివర్శిటీ అమ్మేస్తారు. వైఎస్సార్ తెచ్చిన ఆరోగ్యశ్రీని కొనసాగించాలని చెప్పాను. ఆరోగ్యశ్రీ పథకం మంచిది.. కొనసాగించాలని నేను సీఎం అయ్యాక చెప్పాను. ఇప్పుడున్న సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. ఇక నుంచి నేను కూడా ఊరుకోను. ఎక్కడ ఎవరు బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో పోరాడదాం. కమీషన్లు అడుతున్నారని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఈ సోది కబుర్లు వినడానికి నేను అసెంబ్లీకి రావాలా?" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

### తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు.

ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

### ఇకపై బయటకు వస్తా..
### ప్రజలన తరఫున పోరాడతా

" పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 80-90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరఫున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.

### రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా

"ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా..భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్‌సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 20-30శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

### ఆపరేషన్ కగార్ ఆపేయాలి

భాజపా వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం" అని కేసీఆర్ అన్నారు.

# పాతికేళ్లుగా కేసీఆర్ వెంటే ఉన్నా..

**హైదరాబాద్:** తెలంగాణలో అభివృద్ధిని పరుగులు పెట్టించి, పేద ప్రజలకు సంక్షేమాన్ని పంచిన కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌పార్టీ పాతికేళ్ల పండుగ సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో తన ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు. ప్రజలు ఒక్కసారి చేసే పొరపాటుతో కాంగ్రెస్‌ను ఐదేళ్లు భరించాల్సిన పరిస్థితి నెలకొం ది. దీంతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారు. తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక కేసిఆర్ అని, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ద్వారా మరోసారి రుజువు కానుంది. రెండున్నర దశాబ్ధాల రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే తెలంగాణ రాష్ట్ర సాధన కల సంతృప్తి ఇచ్చింది. హైదరాబాద్ పాతబస్తీ నుంచి పాతికేళ్లుగా కేసీఆర్ వెన్నంటే నడుస్తున్నా, టీఆర్ఎస్ పార్టీ అవిర్భావం కంటే ముందు పత్రికలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం రాబోతున్నట్లు చదివి వెంటనే ఆయన ఇంటికి వెళ్లి కలిశా.. హైదరాబాదీ ముస్లిం – తెలంగాణ ఉద్యమంలో ఎలా కలిసివస్తావని పలువురు ప్రశ్నించారు. అప్పుడు నేను విద్యార్థి దశలోనే 1969 తెలంగాణ ఉద్యమ్యంలో కీలక పాత్ర పోషించా. ఆ తర్వాత ఉద్యమం చల్లారడం కుటుంబ వ్యాపారంలో నిమగ్నమయ్యా. తెలంగాణ వస్తే ఆంధ్ర పాలకుల పెత్తనం పోయి మా నీళ్లు. మా విద్యుత్, మా ఉద్యోగాలు మాకు వర్తిస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశా. అప్పుడు నన్ను పై ఫ్లోర్‌కు తీసుకెళ్లి నా పేరు అడిగి మహమూద్ భాయి.. మాతో జత కలవండి ...కోట్లాది తెలంగాణ సాధిద్దామని చెప్పి భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పిలుపు.. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఒక తండ్రిగా కేసీఆర్‌ను గౌరవిస్తూ వ్యూహాలకు అనుగుణంగా పనిచేస్తూ వస్తున్నా. పార్టీ ఆవిర్భావం నుంచి తన నివాసంలోని అఫీస్‌లో కేసీఆర్‌కు ప్రత్యేక చాంబర్, కుర్చీ ఉందని గుర్తు చేశారు. టీఆర్ఎస్ పార్టీలో జీవిత కాలం రెండో సభ్యత్వం నాదే.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తుంటే తన తల్లి, సతీమణి మినహా బంధువులు, మిత్రులు, తోటి వ్యాపారులందరూ ఉద్యమం పేరుతో తూటాలు, లాఠీ దెబ్బలు ఎందుకు తింటావు... ప్రశాంతంగా వ్యాపారం చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు. కానీ, తెలంగాణ సాధన కల లక్ష్యంతో ముందుకు సాగితే.. ప్రత్యేక రాష్ట్ర సాకారంతో పాటు ఊహించని విధంగా డిప్యూటీ సీఎం,హోం మంత్రి లాంటి కీలక పదవులు నిర్వహించే భాగ్యం కలిగింది. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ ఎక్కడికి బయలుదేరినా.. ఆయన చేతికి ఇమామ్%-%ఎ%-%జామీన్ కడుతున్నా.

ఒక సారి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి 1000 కార్ల ర్యాలీ బయలు దేరినప్పుడు తాను జ్వరంతో ఇమామ్%-%ఏ జామిన్ కట్టడం మర్చిపోగా.. మహమూద్ భాయి దట్టీ తేలేదా అని అడిగి చాంద్రాయణ గుట్ట వద్ద అరగంట సేపు ర్యాలీ నిలిపి వేశారు .దట్టి తీసుకొచ్చి కట్టి తర్వాత ర్యాలీ ముందుకు సాగిందని గుర్తు చేసుకున్నారు.



## మత్స్యకారుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆది నుంచి టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు మేలు జరుగుతోందన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు. మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సయమంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలను రెట్టింపు చేస్తూ రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లను అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

### టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. 2014లో తొలిసారిగా మత్స్యకారులకు ఆర్థియం అందించారన్నారు. 2014-19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం ఆనాటి చంద్రబాబునాయుడి ప్రభుత్వం రూ.788 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ నిధులతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా అందజేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చేపల వేట సమయంలో ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. చేపల వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల అభివృద్ధికి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందన్నారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా ఎటువంటి మేలు జరగలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

చేపల ఎగుమతుల్లో మనమే టాప్

చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందు వరుసలో ఉందని మంత్రి సవిత వెల్లడించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఏపీ నుంచే ఉంటోందన్నారు. మత్స్య సంపద ఎగుమతుల్లో 32 శాతం ఏపీ నుంయి జరుగుతోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

## ఈఎన్‌సీ హరి రామ్‌కు 14 రోజుల రిమాండ్..

-మొదటిపేజీ తరువాయి

ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్స్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్) భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం అరెస్టు అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర షోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎసఏ) నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు శనివారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది. అంతేకాక, హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్‌కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు ఉన్నాయి. పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు కూడా ఉన్నాయి. బొమ్మలరామారంలో ఆరు ఎకరాలలో ఫామ్‌హౌస్, మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇక, బీఎండబ్ల్యూ సహా రెండు కార్లు, ఉన్నాయి. ఇవే కాక, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను కూడా గుర్తించారు. ఆయా ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో భారీగా ఉంటుందని పేర్కొంది. సోదాలు కొనసాగుతున్నాయని, హరిరామ్ ఆస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశముందని ఏసీబీ పేర్కొంది. కాగా, హైదరాబాద్, షేక్‌పేటలోని ఆదిత్య టవర్స్‌లో హరిరామ్ నివసిస్తున్న ఇంట్లో సోదాలు చేసిన అధికారులు.. అక్కడి కంప్యూటర్లు, లాప్‌టాపలను పరిశీలించారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హరిరామ్ భార్య అనిత ఇరిగేషన్ విభాగంలో డిప్యూటీ ఈఎన్‌సీగా పనిచేస్తున్నారు. దీంతో ఏసీబీ అధికారులు ఆమెను కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామం.. హరిరామ్ స్వగ్రామం. ఎదురగడ్డలోని హరిరామ్ నివాసంతోపాటు ఆయన బంధువుల ఇంట్లో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని బృందం సోదాలు చేసింది. నిజానికి, ఏసీబీ దాడులు జరుగుతాయనే సమాచారం చాలా రోజుల నుంచే ఉండడంతో హరిరామ్ ఇప్పటికే జాగ్రత్తలు తీసుకున్నారని, చాలా ఆస్తులు బినామీల పేర్లతో పెట్టారని సమాచారం.

## భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

-మొదటిపేజీ తరువాయి

తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థికశాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మరోవైపు, రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్ – శశాంక్ గోయల్
ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో– జయేశ్ రంజన్
పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి– సంజయ్ కుమార్
ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ – స్మితా సబర్వాల్
కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – దానకిశోర్
పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి (హెచ్ఎండీఏ వెలుపల)– టీకే శ్రీదేవి
పట్టణాభివృద్ధి కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి) – ఇలంబర్తి
జీహెచ్ఎంసీ కమిషనర్ – ఆర్వీ కర్ణన్
ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ – కె.శశాంక
జెన్‌కో సీఎండీ – ఎస్. హరీశ్
రాష్ట్రమానవ హక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో – నిఖిల
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ – సంగీతం సత్యనారాయణ
దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో – ఎస్. వెంకటరావు
సెర్ప్ అదనపు సీఈవో – పి. కాత్యాయనీదేవి
ఇండస్ట్రీ, ఇన్వెస్టిమెంట్ సెల్ అదనపు సీఈవో – ఈవీ నర్సింహారెడ్డి
జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ – హేమంత్‌సహదేవ్ రావు
టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ – ఫణీంద్రారెడ్డి
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ – కధిరవన్
హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) – విద్యాసాగర్
హెచ్ఎండీఏ సెక్రటరీ – ఉపేందర్ రెడ్డి

## స్వధా ఫౌండేషన్ వారు

# మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి

– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 27:** స్వధా ఫౌండేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలను అనంతపురం జిల్లా నందు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఎస్ ఎస్ బి ఎన్ డిగ్రీ కళాశాల నందు సమావేశ మందిరంలో స్వధా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయిలో అమరావతి నందు కలెక్టర్ల సమావేశం రెండు రోజులపాటు నిర్వహించడం జరిగిందని, ఆ రెండు రోజుల సమావేశంలో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు అనంతపురం గురించి రెండు రోజులు సమావేశంలో కూడా మాట్లాడడం జరిగిందని తలసరి ఆదాయం 13 జిల్లాలలో అనంతపురం జిల్లా ఆరో స్థానంలో ఉందని కుమ్మరి గోదావరి జిల్లాలలో సాగునీరు ఎక్కువగా ఉంటుందని సంవత్సరానికి నాలుగు పంటలు పండించుకోవచ్చని అలాంటి అనంతపురం జిల్లా నందు వారి కంటే ఎక్కువ పండించే పంటలను ఆర్టికల్చర్,మైక్రో ఇరిగేషన్ ద్వారా అనంతపురం జిల్లా నుండి పండించడం జరుగుతుందని అన్నారు. అనంతపురం జిల్లా ఫ్రూట్ బాల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కాకుండా , ఫ్రూట్ బోల్ ఆఫ్ ఇండియా గా పేరు సంపాదించడం జరుగుతున్నదని తెలిపారు. ఢిల్లీలో ఎక్కువగా అనంతపురం నుండి ఎగుమతి చేసే పుచ్చకాయ కు ఎక్కువ డిమాండ్ ఉంటుందని, అలాగే దుబాయ్ కి అనంతపురం జిల్లా నుండి పండించే బనానాను ఎగుమతి చేయడం జరుగుతున్నదని తెలిపారు.

మన జిల్లాలో అధిక సంఖ్యలో ఎన్జీవోలు పనిచేస్తున్నాయని వాటిలో ఆర్ డి టి , సత్య సాయి, మొక్కలు నాటి కార్యక్రమం,




ఆడపిల్లలను చదివించే కార్యక్రమం ఇలా చాలా ఎన్జీవోలు పనిచేస్తున్నాయని అనంతపురం జిల్లా ఎడారి ప్రాంతం వెనుకబడిన ప్రాంతం అనే విషయాన్ని ప్రజలందరూ మరిచిపోవాలని అన్నారు.అందరికీ మంచి చేయాలని ఉద్దేశంతో ఉంటుందని నేను ఎవరి నుంచో లాభ పొందాను వారికి నేను వెనక్కి తిరిగి ఇవ్వాలని తపన ఉంటుందని అలా చేసేవారిలో రాజేష్ గారు శ్వేదా ఫౌండేషన్ వారికి ఉందని అన్నారు. నిరుపేద ప్రజల కుటుంబాలకు పిల్లలకు ఆదుకుని వారికి ఉన్నత చదువులు చదివించుటకు ఆర్థిక సహాయం, ఉన్నత విద్య కోసం శిక్షణలు , వారికి గైడ్ చేసి, వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు చేపట్టే కార్యక్రమాలను ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇచ్చి, వారికి స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్ లు, ఇచ్చి వారికి అందించి, మంచి చదువులు, మంచి ఉద్యోగాలను అందించే విధంగా సహాయం చేసి నిరుపేద కుటుంబాలలో అభివృద్ధి చెందినందుకు గత 15 సంవత్సరాలుగా కృషి చేస్తున్నందుకు స్వధా ఫౌండేషన్ వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో చిన్ని, స్వాతి, సమీన్ తాజ్, మహేష్



ఈ సంస్థ ద్వారా లబ్ధి పొంది వారి జీవితానికి బంగారు భవిష్యత్తును ఈ ఫౌండేషన్ ద్వారా అందించిన విషయాలను తెలియజేయడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు.

స్వధా ఫౌండేషన్ ఒక తపన తో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి జరుగుతున్నదని, ఇలాంటి అనేక కార్యక్రమాలను అనంతపురం జిల్లాలో చేపట్టాలని, అలాగే ఇక్కడ శిక్షణ పొందుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటూ, అలాగే మీరు సాగించే ఈ ప్రయాణంలో ప్రభుత్వం ద్వారా మీకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అనంతరం ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్మార్ట్ ఫోన్లు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవిఈవో వెంకటరమణ నాయక్, స్వధా ఫౌండేషన్ నిర్వాహకులు రాజేష్, రామ్, దివ్య, విద్యార్థినీ, విద్యార్థులు తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జి.బి.ఆర్ విద్యాసంస్థలలో ఐ.ఎమ్.ఎ.

# ఉచిత విద్యాపధకం పరీక్షకు 87% విద్యార్థుల హాజరు

– ఉచిత విద్యా పధకానికి విశేష స్పందన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐ.ఎమ్.ఎ. అనపర్తి వారు ది.వి. 27-04-2025, ఆదివారం నాడు జి.బి.ఆర్ విద్యాసంస్థలో ఉచిత విద్యాపధకం ఐ.ఎమ్.ఎ. టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఐ.ఎమ్.ఎ. డాక్టర్స్ శ్రీ తాడి రామగుర్రెడ్డి , జి.యస్.ఎన్. రెడ్డి , తేతలి వెంకట రామిరెడ్డి సువర్ణ హస్తాల మీదుగా ప్రశ్నాపత్రం ఆవిష్కరణ జరిగినది. పరీక్ష ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడినది. ఒకటి నుండి పదవ తరగతి వరకు 1180మంది రిజిస్ట్రేషన్లు చేయించుకోగా 1029మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. ఈ ఐ.ఎమ్.ఎ పరీక్ష నిష్ణాతులైన ఐ.ఎమ్.ఎ. కమిటీ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించబడినది. నర్సరీ, ఎల్. కె. జి. , యు. కె. జి. తరగతులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి పరీక్షా ఫలితాలు ఐ.ఎమ్. ఎ. డాక్టర్ల చేతుల మీదుగా డ్రా




తీయడం ద్వారా ఎంపిక చెయ్యడం జరుగుతుంది. ఈ ఐ.ఎమ్.ఎ. పరీక్ష ద్వారా ప్రతీ తరగతికి మొదటి 5 స్థానాలు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి 2025-26 విద్యా సంవత్సరంలో ఉచిత విద్యను అందించుట, దాని ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని జి.బి.ఆర్. సెక్రటరీ మరియు కరస్పాండెంట్ శ్రీ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) తెలియజేశారు. ఐ.ఎమ్.ఎ. టాలెంట్ టెస్ట్ నిర్వహణకై సహకరించిన ఉపాధ్యాయ బృందానికి, ఇంతటి విశేష స్పందనకు కారణమైన ప్రజలకు, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.

# భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 27 :** అంధ మరియ అనాధ బాలికలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆకాంక్షించారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్టీవో ఆఫీస్ రోడ్ లో ఉన్న మీనాక్షి సమ్మిలిత వికాస కేంద్రంను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సందర్శించారు. ఈ సంస్థలో చదువుతున్న అంధ మరియ అనాధ బాలికల క్షేమ సమాచారాలను, అన్ని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీనాక్షి సమ్మిలిత వికాస కేంద్రం సంస్థ ద్వారా లబ్ధి పొందుతున్న బాలికలను అభినందిస్తూ, వారు ఇంకా భవిష్యత్తులో మంచి స్థాయికి రావాలన్నారు. ఈ సంస్థ చేస్తున్న సేవలను అభినందిస్తూ మరిన్ని సేవలు ఇంకను ఈ సమాజానికి



అందించవలసిందిగా కోరారు. ఈ సంస్థకు ప్రభుత్వం తరపున, జిల్లా యంత్రాంగం తరపున ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించిన వెంటనే వారికి తగురీతిలో సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సంస్థ కోరిన విధంగా వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. వారం రోజుల లోపల ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు




సిద్ధం చేసి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్, సంస్థ నిర్వాహకులు రవికాంత్ రమణ మరియు టీచర్ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 29న కీలపట్ల శ్రీ కోనేటి రాయస్వామి

# ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**అంకుశం న్యూస్ చిత్తూర్ ఏప్రిల్ 27:** చిత్తూరు జిల్లా కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో ఏప్రిల్ 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 11 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. **ఆలయ చరిత్ర :** చిత్తూరు జిల్లా గంగవరం (మం) కీలపట్ల గ్రామంలో వెలసిన శ్రీ కోనేటిరాయ స్వామి దేవాలయం అతి పురాతనమైన చారిత్రక ప్రసిద్ధి కలిగిన దేవాలయం. ఈ స్వామి వారిని భృగు మహర్షి ప్రతిష్ట చేసి ఆరాధించగా, పాండవ మధ్యముడు అర్జునుడి ముని మనవడు జనమేజయ మహారాజు గుడి కట్టించారు. తర్వాత కాలంలో చోళ, పల్లవ, విజయనగర సామ్రాజ్యాధీశుల ఏలుబడిలో విశేష పూజలు అందుకుని తర్వాత మహమ్మదీయుల దండయాత్రలకు భయపడి గ్రామస్తులు స్వామి వారిని కోనేటిలో దాచి ఉంచారు. ఆ తర్వాత కాలంలో చంద్రగిరి సంస్థానాధీశుల సామంతులు శ్రీ బోడికొండమ నాయుడు గారికి కలలో సాక్షాత్కరించి కోనేటిలో ఉన్న స్వామివారిని తిరిగి ప్రతిష్ఠించమని కోరినారు. ఆ విధంగా కోనేటి నుండి ప్రతిష్ట చేయబడి కోనేటి రాయ స్వామిగా ప్రసిద్ధి చెందినారు. అన్నమయ్య కీర్తనలలో శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయం ఈ గ్రామంలో మాత్రమే ఉన్నది. కోరినదే తడవుగా కొండంత వరములను ప్రసాదించే శ్రీ కోనేటిరాయ స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వైఖానస ఆగమోక్త ప్రకారముగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

## ప్రజలకు కంటి చూపు ప్రసాదించడమే లయన్స్ క్లబ్ లక్ష్యం..




**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 27:** గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గల పేద ప్రజలకు కంటి చూపును ప్రసాదించడమే లయన్స్ క్లబ్ లక్ష్యము అని అధ్యక్షులు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి ఆకులేటి రమేష్ బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణములో లయన్స్ క్లబ్ వారు ఉచిత కంటి చికిత్స శిబిరమును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతగా కీర్తిశేషులు గూడూరు నాగయ్య జ్ఞాపకార్థం వీరి కుమారులు గూడూరు మోహన్ దాస్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. లయన్స్ క్లబ్ దేశవ్యాప్తంగా పేద ప్రజలకు విశేషంగా సేవలను అందిస్తూ లక్షల సంఖ్యలో పేదలకు కంటి చూపును ప్రసాదించడం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే ధర్మవరంలో 70 వేలకు పైగా పేదలకు కంటి చూపును ప్రసాదించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరాలు దాతల సహాయ సహకారములతో నిర్వహిస్తూ లయన్స్ క్లబ్ విజయపథంలో నడిచేందుకు సభ్యుల సహకారం మరువలేనిదని వారు తెలిపారు. ఈ శిబిరంలో 93 మంది కంటి రోగులు, వైద్య చికిత్సలను అందుకోగా అందులో 72 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరందరికీ ఉచిత ఆపరేషన్లతో పాటు, ఉచితంగా అద్దాలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దాత తో పాటు పలువురు లయన్స్ క్లబ్ సభ్యులను కమిటీ ఘనంగా సత్కరించారు. కంటి టెక్నాలజీ డాక్టర్ నాగేంద్ర చే వైద్యులకు కంటి పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, సాగా సురేష్, గోశే రాధాకృష్ణ, గవ్వల రాధాకృష్ణ, చందా నాగరాజు, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.కాగా సేవలు అందించిన గూడూరు మోహన్ దాస్, గూడూరు రాజ గోపాల్, మెటికల కుళ్లాయప్ప లను ఘనంగా సన్మానం చేశారు.

## శ్రీ మహాలక్ష్మి అమ్మ వారి తీర్థ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** పెదపూడి మండలం రామేశ్వరంలో శ్రీ మహాలక్ష్మి అమ్మ వారి తీర్థ మహోత్సవం సందర్భంగా అమ్మ వారిని దర్శించుకున్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల, రామేశ్వరం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు విరాళం





**అంకుశం న్యూస్ తిరుమల ఏప్రిల్ 27:** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.50 కోట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత(CSR) కింద ఇటీవల విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆ సంస్థ జోనల్ హెడ్ కె.ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ ఈ.వెంకటేశ్వర్లు విరాళం చెక్కును అందజేశారు.

## అనంతలో 28వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– : ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 27 :** అనంతపురం నగరంలోఈనెల 28వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి దయనీయం

- రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారిలా చంద్రబాబు
- రాజధాని విస్తరణ పేరుతో మళ్లీ 44 వేల ఎకరాలా?
- పోలవరం ఎత్తు తగ్గింపుతో రాష్ట్రానికి తీవ్ర విఘాతం
- రూ.1.47 లక్షల కోట్లు అప్పు చేయడం సంపద సృష్టా?
- రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై ఆలోచన చేయరా?
- ప్రధాని మోదీ పర్యటనలో రాష్ట్రాభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయించాలి
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్

**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 27 :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా అని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 11 నెలలుగా మాటలకే పరిమితం అవుతున్నారని దుయ్యాబట్టారు. ఇంకా ఆయన ఏమన్నారంటే "రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతోంది. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తే ఆందోళనకరంగా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు అనేక వాగ్దానాలను మేనిఫెస్టోలో పెట్టారు. కానీ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదు. కేవలం మాటలకే పరిమితం అవుతున్నారు. రాష్ట్రంలో సంక్షేమం అందించే విషయంలో, అభివృద్ధి విషయంలో ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇవ్వడం మినహా ఏ పథకాన్నీ అమలు చేయలేదు. పింఛన్లలోనూ 11 నెలల కాలంలో సుమారు 3 లక్షల మందికి పైగా కోత పెట్టారు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం పెట్టారు. 16 వేల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి 11 నెలలకు నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. వచ్చే అకడమిక్ ఇయర్ ప్రారంభం అయ్యేలోగా టీచర్ పోస్టులు భర్తీ చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు ఇస్తానని ఇప్పటికే ఒక ఏడాది ఎగ్గొట్టారు. ఈ ఏడాది మేలో తల్లికి వందనం ఇస్తానని గతంలో చెప్పారు. తాజాగా తల్లికి వందనం ఒక విడతలో ఇవ్వాలో.. ఎలా ఇవ్వాలో ఆలోచిస్తున్నామని చంద్రబాబు చెప్పడం చూస్తే ఆయనది నోరా? తాటిమట్టా? అని భావించాల్సి వస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 అందజేశాం. కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. ధాన్యం నుంచి ఉద్యానపంటల వరకు వేటికీ మద్దతు ధర లభించడం లేదు. 11 నెలల్లో వ్యవసాయశాఖ అనేది ఒకటుందా? అనే పరిస్థితికి వచ్చింది. రైతాంగాన్ని ఆదుకునే విషయంలో సమగ్రమైన సమీక్ష కూడా చేసిన దాఖలా లేదు. కేవలం రాజధాని పేరుతో కాలయాపన చేస్తున్నారు. 2014లో రాష్ట్రం విడిపోయాక చంద్రబాబు రాజధాని పేరుతో ఏ అభివృద్ధీ చేయలేదు. ఇప్పుడు రాజధానికి లక్ష కోట్లు పెట్టాలని అంటున్నారు. ఇప్పటికే అమరావతిలో 58 వేల ఎకరాలు అందుబాటులో ఉంది. మళ్లీ 44 వేల ఎకరాలు కావాలని అంటున్నారు. ఇప్పటికే సేకరించిన భూమిలో అభివృద్ధి చేయలేదు. రైతులకు ప్లాట్లు కేటాయించలేదు. మళ్లీ ఇప్పుడు ల్యాండ్ పూలింగ్, భూసేకరణ అంటున్నారు. ఇది ప్రభుత్వమా? రియల్ ఎస్టేట్ వ్యాపారమా? చంద్రబాబు ముఖ్యమంత్రా? లేక సీఎం సీట్లో కూర్చుని రియల్ ఎస్టేట్ చేయడానికి ఉన్నారా? కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు అన్యాయానికి గురి అయ్యాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అప్పులు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికే 1.47 లక్షల కోట్లు అప్పు చేశారు. ఇదేనా సంపద సృష్టి అంటే? చివరకు దేశ చరిత్రలో ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా గనులను కూడా అప్పుల కోసం తాకట్టు పెడుతున్న పరిస్థితి దాపురించింది. రాష్ట్ర అభివృద్ధి విషయంలోనూ ఒక ప్రణాళిక లేదు. గతంలో ఐదేళ్లు రాజధాని పేరుతో ఎలా గడిపారో మళ్లీ అదే బాటలో వెళ్తున్నారు. గతంలో మోదీ రాజధాని కోసం మట్టి, నీళ్లు తెచ్చారు. ఇప్పుడు రాజధాని పునఃనిర్మాణం అంటూ మరోసారి ప్రధానిని రప్పిస్తున్నారు. 2014లో ఇదే ప్రధాని మోదీతో రాజధాని నిర్మాణానికి ఫౌండేషన్ వేయించి చివరకు 2019 ఎన్నికలు వచ్చే సమయానికి మోదీ ఏమీ చేయలేదని పొత్తు కూడా వీడారు. ఆ తర్వాత పొత్తు పెట్టుకుని గెలిచి మళ్లీ ఇప్పుడు మోదీని రప్పిస్తున్నారు? ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? రాయలసీమలో వెనుకబడిన జిల్లాలు ఉన్నాయ. అన్ని వర్గాలను మోసం చేశారు. పరిశ్రమలు తెస్తామని చెప్పి ఊరూరా బెల్టుషాపులు తెచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 99 రూపాయలకు క్వార్టర్ బాటిల్.. 99 పైసలకు ఎకరా భూమిని తమకు కావాల్సిన వారికి ధారాదత్తం చేస్తున్నారు. కోట్లు విలువైన భూమిని 99 పైసలకు ఇవ్వచ్చని నిరూపించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమే. ప్రధాని మోదీ రాక నేపథ్యంలో పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రయోజనాల కోసం విన్నవించాలని కోరుతున్నాం" అని అనంత వెంకటరామిరెడ్డి సూచించారు.




# చంద్రన్న పాలనలోగంగపుత్రుల సంక్షేమం

- "మత్స్యకారుల సేవలో" పథకంపై ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందన
- ఫిష్ అంధ్రా అన్నది ఒక దోపిడీ పథకం
- చేపల ఎగుమతిలో ఏపీ అగ్రస్థానంలో ఉందన్న సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 27:** ఏపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదనిమత్స్య కారులకు మొదటి నుంచి అండగా ఉండేది తెలుగుదేశంపార్టీ ప్రభుత్వమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారుల సేవలో పథకం ప్రారంభం ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.20వేల సాయాన్ని విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. దీని ద్వారా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. గతంలో మత్స్యకారుల విషయంలో వైసీపీ మోసపూరిత హామీలు ఇచ్చిందన్నారు. దానిని సక్రమంగా అమలు చేయక మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు దుర్వినియోగం చేశారన్నారు. దీని ద్వారా ఒక్క మత్స్యకారుని కుటుంబానికైనా మేలు జరిగిందేమో వారు సమాధానం చెప్పాలన్నారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందని.. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టామని గుర్తు చేశారు. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలుండగా.. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం టాప్ ప్లేస్ లో ఉందన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్న ప్రోత్సాహం వలనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు...



## టీడీపీ సభ్యత్వ ఇన్యూరెన్స్ చెక్కును మృతుడు కుటుంబానికి అందచేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** జనవరి 20వ తేదీన సోమేశ్వరం-రాజానగరం రోడ్డులో వి.సావరం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాయవరం మండలం, వెదురుపాక సావరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెలుబుడి రమణ కుటుంబానికి మంజూరు అయిన టీడీపీ సభ్యత్వ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షల చెక్కును ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వి.సావరం గ్రామంలో మృతుని ఇంటివద్దకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టకాలంలో టీడీపీ సభ్యత్వమే తన కుటుంబానికి బరోసా అయిందని భార్య రమణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి గణేష్, రాయుడు ప్రసాద్, వెలగల వీర్రెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, గుత్తుల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణ చౌదరి, తదితర్లు పాల్గొన్నారు.

## ఆర్డీటిపై బిజెపి
# ఆంక్షలు పెడితే ప్రజా పోరాటం






- ఆర్డిటిని కాపాడుకుంటాం
- అధ్యక్షుడు సాకే హరి

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 27:** అనంతపురం జిల్లాలో గత 50 సంవత్సరాలుకి పైగా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ బడుగు బలహీనవర్గాల దళితుల సంక్షేమమే లక్ష్యంగాఅభివృద్ధి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్డీటికి ఆటంకాలు సృష్టిస్తే ప్రజా పోరాటం తప్పదని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. అదివారం కలెక్టర్ కార్యాలయం ముందున్న ఫాదర్ విన్సెంట్ పెర్రర్ విగ్రహానికి జేఏసీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించి ఆర్డీటిపై బిజేపీ ప్రభుత్వం కక్ష్య సాధింపులు మానుకోవాలని నిరసన తెలిపారు.అనంతరం సాకే హరి మాట్లాడుతూ..ఆర్డీటికి విదేశాల నుండి వస్తున్న నిధులను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పాలన ప్రభుత్వాలకు ప్రత్యన్మాయంగా పేద ప్రజలకు సేవ, సంక్షేమ కార్యక్రమాలు చేయడాన్ని జీర్ణించుకోలేని కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగమే నిధులు నిలుపుదలన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్ష్యంగా 3896గ్రామాల్లో 4,51,200కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. అలాగే విద్య వైద్యం, గృహ నిర్మాణాలు, పొదుపు సంఘాలు,వికలాంగులు, క్రీడాలు, రైతాంగాలకు ప్రోత్సహించి అభివృద్ధి పరిచందాన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న ఆర్డీటికి అండగ నిలవాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆర్డీటికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలపై టిడిపి,జనసేన పార్టీలు స్పందించాలని లేదంటే పేదల వ్యతిరేకులగా మారతారన్నారు. కార్యక్ర్యమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హరినాథ్ రెడ్డి. అడ్వకెట్ ఆనంద్.బేడా బుడగ జంగం మళ్ళీ కార్జున. వైస్సార్సీపి ఎస్సీ సెల్ లబ్బే రాఘవ.సామాజిక సేవ నాయకులు తాడిమర్రి శివన్న. జేఏసీ నాయకులు రామకృష్ణ. బ్రాకెట్ల సూర్య నారాయణ. నారాయణ స్వామి.దుర్గం రామాంజినేయులు.లక్ష్మి నారాయణ. పెద్దిరాజు. పుల్లన్న.సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.

## కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవ సభ - కందుకూరి రంగస్థల విశిష్ఠ పురస్కారములు





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాటక పరిషత్తుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకి విశ్వ నట భూషణ్ బిరుదుతో సత్కరించిన మాజీ మంత్రివర్యులు, టిడిపి సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు,సీతారామరాజు స్మారక కళావేదిక సభ్యులు,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాటక పరిషత్తుల సమాఖ్య సభ్యులు. పంపన సంస్కృతి పురస్కార్ వారి సాంఘిక నాటిక రచనల పోటీ విజేతలకు నగదు- జ్ఞాపిక బహుకరణ చేసిన మాజీ మంత్రివర్యులు, టిడిపి సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు,సీతారామరాజు స్మారక కళావేదిక సభ్యులు,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాటక పరిషత్తుల సమాఖ్య సభ్యులు. సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో కందుకూరి రంగస్థల విశిష్ఠ పురస్కారములు అందచేసిన మాజీ మంత్రివర్యులు, టిడిపి సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు, సీతారామరాజు స్మారక కళావేదిక సభ్యులు,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాటక పరిషత్తుల సమాఖ్య సభ్యులు ఉన్నారు.

## గంగపుత్రుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం-మంత్రి వాసంశెట్టి

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- వేట నిషేధ భృతి రూ.20 వేలకు పెంపు హర్షనీయం



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** కూటమి ప్రభుత్వం గంగపుత్రులకు ఇచ్చిన ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భ్రుతి రూ.10 వేల నుండి 20 వేలకు పెంచుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ముదావహమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు అంటే 61 రోజులపాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా ఇంటికే పరిమితం కావలసి ఉంటుందని, ఆ సమయంలో మత్స్యకారుల జీవనం కోసం, వారి కుటుంబాలకు ఇచ్చే భ్రుతిని రెట్టింపు చేస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు లబ్ది చేకూరుస్తుందని అన్నారు. అంతేకాకుండా, మత్యాకారులకు నేరుగా వారి ఖాతాల్లో రూ. 20 వేలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.259 కోట్లు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లలో చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే 2014-19 మధ్య కాలంలో మత్స్యకారులకు వలలు, పడవలు, ఐస్ బాక్సులు రాయితీలపై ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. చేపల వేట సమయంలో మత్స్యకారులు మరణిస్తే రూ.10 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నామని, వేటకు వెళ్ళే మర పడవలకు 3 వేల లీటర్లు,( మోటార్ బోట్లకు 300 లీటర్ల చొప్పున ) లీటర్ కు 9 రూపాయల చొప్పున డీజల్ రాయితీ ఇస్తున్నారని అన్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలో ఇలాంటి ప్రభుత్వ చర్యల వలన వారు ఆర్థికంగా నిలదొక్కకుంటారని మంత్రి సుభాష్ అన్నారు. మన రాష్ట్రంలో 555 మత్స్య గ్రామాలు ఉన్నాయని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు అన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఉండగా, 32 శాతం ఉత్పత్తులు ఎగుమతులు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే మిన్నగా మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందనటం లో ఎలాంటి సందేహం లేదని మంత్రి సుభాష్ వెల్లడించారు.

## అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన జనసేన పార్టీ ఇన్చార్జి శ్రీ పోలిశెట్టి



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో 600 మార్కులకుగాను 595 మార్కులు సాధించి కోనసీమ జిల్లాలో 3వ స్థానం రామచంద్రాపురం మండలంలో ప్రథమ స్థానంలోను నిలిచిన ద్రాక్షారామ - తోటపేట లో చదివిన సూర్య స్కూల్ విద్యార్థి దవులూరి మేఘన 595(తోటపేట) ను మరియు 593 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన తలాటం భవిత(వెలంపాలెం), తివారి ప్రియ (తాటిపల్లి)లను రామచంద్రాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్ అభినందించారు.గ్రామీణ ప్రాంతంలో సాధారణ ఫీజులతో ఇలాంటి అసాధారణ ఫలితాలు సాధించడం చాలా గొప్ప విషయమని,ఈ విజయానికి కృషి చేసిన సూర్య స్కూల్ మేనేజ్మెంట్ ను అధ్యాపక బృందాన్ని విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను అభినందించారు.